

# కరపత్రం

SINCE 2014

గురువారం డిసెంబర్ 19 2024 | సంపుటి :0 | సంచిక : 71 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్'...

## రోడ్డుపై బైఠాయించి సీఎం రేవంత్ నిరసన



హైదరాబాద్: మణిపుర్ అల్లర్లు, గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.సీఎం రేవంత్‌రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

# అదానీ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించిన నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు.
కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్'.. రోడ్డుపై బైఠాయించి సీఎం రేవంత్ నిరసన
"అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం.



# బంగాళాఖాతంలోకి 'ధరణి' పోర్టల్



హైదరాబాద్: భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## కూల్చివేతలపై కీలక ప్రకటన.. హైడ్రా విధివిధానాలు వివరించిన రంగనాథ్



నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది.
హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలను హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

## ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది: మంత్రి శ్రీధర్‌బాబు



ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు.

# ఆటో డ్రైవర్లను ఆదుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు




ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. ఖాకీ చొక్కాలు ధరించి తెలంగాణ అసెంబ్లీకి బయల్దేరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. కాగా, ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను ఇచ్చామని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తామన్న 12వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. బీఆర్ఎస్ పక్షాన వారికోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు, వారికి ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ఇప్పటికే బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.



## సంపాదకీయం

# మళ్లీ విద్వేషాలు విజృంభిస్తున్న వేళ..

కొందరి పేర్లు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. ఎంత కాలం గడిచిపోయినా చరిత్రలో వారి పేర్లను, వారు చేసిన పనులను చెరిపివేయడం అంత సులభం కాదు. పాములపర్తి వెంకట నరసింహారావు ఇదే డిసెంబర్ మాసంలో దివంగతులై రెండు దశాబ్దాలు గడచిపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన పేరు స్మరించుకునే అవసరం నేటి రాజకీయ నాయకులకు కలిగింది. సుప్రీంకోర్టుకు, జాతీయ సమగ్రతా మండలికి బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను కూడా విస్మరించి, ఆ పార్టీ అగ్రనేతల సమక్షంలో బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేత జరిగింది. ఈ ఘటనకు పీవీనే చాలా మంది తప్పుపట్టారు. అయితే అంతకు సరిగ్గా ఏడాది ముందే 1991లో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మతపరమైన భావోద్వేగాలు తలెత్తకుండా చూసింది కూడా పీవీయే అన్న విషయం చాలా మంది మరిచిపోయారు! సంభల్‌లో మతపరమైన హింసాకాండ, మధురలో వివాదం నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కూడా ఆ చట్టం గుర్తుకువచ్చింది. ఇదే ఏడాది ప్రథమంలో పీవీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఈ చట్టాన్ని రద్దు చేయాలని తమ పార్టీ నేతలే అంటుంటే వారించలేకపోతోంది. నరసింహారావును అనేక సార్లు అగౌరవపరిచిన కాంగ్రెస్ నేతలకు కూడా ఇప్పుడు పీవీ ప్రభుత్వమే ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఆమోదింపచేసిన విషయం గుర్తుకు వచ్చింది.

నిజానికి ఈ చట్టంపై మళ్లీ చర్చ రేపి తీగ లాగింది కొద్ది రోజుల క్రితం పదవీవిరమణ చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్. ఒక మత ప్రదేశపు స్వభావాన్ని మార్చడం 1991 చట్టం క్రింద నిషేధించినప్పటికీ, ఆ ప్రదేశపు మత స్వభావాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడాన్ని ఆ చట్టం అడ్డుకోలేదని చంద్రచూడ్ వ్యాఖ్యానించి ప్రస్తుత వివాదాలన్నిటికీ తెర లేపారు. దేశంలో అనేక ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాలలో సర్వేల కోసం పిటిషన్లు దాఖలయ్యాయి. వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ సర్వేకు ఆదేశించిన స్థానిక కోర్టు ఈ చట్టం ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత 1991 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా యూపీలోని సంభల్ మసీదులో అలాంటి సర్వేను జిల్లా కోర్టు అనుమతించినందుకే గత నెలలో మతపరమైన హింసాకాండ జరిగింది.

ఈ నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ప్రార్థనా మందిరాల విషయంలో దేశంలో అన్ని కోర్టులు యథాతథ స్థితి నెలకొనేలా చూడాలని గత వారం ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1991 చట్టం చెల్లుతుందా లేదా అన్న విషయం తాము తేల్చేంతవరకూ ప్రార్థనా స్థలాల్లో సర్వేలు జరిపించాలని దాఖలైన పిటిషన్లను ఏ కోర్టూ నమోదు చేసుకోవద్దని, ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అసలు ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై కేంద్ర ప్రభుత్వం నాలుగు వారాల్లో తన అభిప్రాయం ఏమిటో చెప్పాలని స్పష్టంగా నిర్దేశిస్తూ 2025 ఫిబ్రవరి 17 వరకు తదుపరి విచారణను వాయిదా వేసింది. దీనితో కనీసం మూడునెలల వరకైనా ప్రార్థనా స్థలాల విషయంలో మత పరమైన భావోద్వేగాలకు అడ్డుకట్ట వేసినట్లైంది.

అయోధ్యలో రామజన్మభూమిపై బీజేపీ నిర్వహిస్తున్న ఉద్యమం తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన పీవీ నరసింహారావు, వచ్చీ రాగానే దేశవ్యాప్తంగా ఇతర ప్రార్థనాస్థలాల్లో ఇలాంటి భావోద్వేగాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రార్థనాస్థలాల్లో యథాతథ పరిస్థితిని పరిరక్షించేందుకు చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు 1991 జూలైలో రాష్ట్రపతి వెంకట్రామన్ పార్లమెంటు ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలోనే స్పష్టం చేశారు. ఆ తరువాత సెప్టెంబర్‌లో రెండు రోజుల పాటు లోక్‌సభలో అద్భుతమైన చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు దేశంలో అసహనం వ్యాప్తి చేయాలని చూస్తున్నాయని, ప్రజలు ఏనాడో మరిచిపోయిన వివాదాలను తిరగదోడి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, అలాంటి కొత్త వివాదాలు రేకెత్తకుండా ఉండేందుకే ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) బిల్లును ప్రవేశపెడుతున్నామని హెూంమంత్రి ఎస్.బి. చవాన్ స్పష్టం చేశారు. ప్రేమ, శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పర్చడమే ఈ బిల్లు లక్ష్యమని అన్నారు. బీజేపీ నుంచి అద్వాణీ, జస్వంత్ సింగ్, ఉమాభారతి, రాంనాయక్ తదితరులుబీ కాంగ్రెస్ నుంచి దిగ్విజయ్ సింగ్, పిఎం సయీద్, మణిశంకర్ అయ్యర్‌బీ సీపీఐ(ఎం) నుంచి సోమనాథ ఛటర్జీబీ సీపీఐ నుంచి ఇంద్రజిత్ గుప్తా, గీతా ముఖర్జీ అత్యంత ప్రతిభావంతంగా చర్చలో పాల్గొన్నారు. ఆ చర్చల ప్రామాణికతతో పోలిస్తే ఇవాళ్టి చర్చలు పేలవంగా కనిపిస్తాయి. ఈ బిల్లు వల్ల మనం సాధించేది ఏమీ లేదని, కొత్త వివాదాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అద్వాణీ అన్నారు. ప్రతి వివాదానికీ పరిష్కారం లభించాల్సిందేనని, అన్ని మత ప్రదేశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ఉమాభారతి స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో బీజేపీకి మిత్రుడుగా మారిన అప్పటి జనతాదళ్(యు)కు చెందిన దళిత నేత ఒకరు ఈ బిల్లును బలంగా సమర్థించారు. ఈ దేశంలో 33 కోట్లమంది దేవుళ్ళు ఉన్నప్పటికీ దేశంలోని 5,76,000 గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని గుర్తు చేశారు. లక్షలాది ప్రజలు ఆకలితో, వైద్య చికిత్సలు లేకుండా, ఉపాధి లభించకుండా మరణిస్తున్నారని, ఇలాంటి తీవ్రమైన అంశాలను పరిష్కరించకుండా మతపరమైన ఘర్షణల్లో కూరుకుపోవడం శోచనీయమని, ఎక్కడ మసీదు ఉందో, ఎక్కడ ఆలయం ఉందో తేల్చడం ప్రధానం కాదని సీపీఐ(ఎం) నేత సోమనాథ ఛటర్జీ అన్నారు.

# రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు గమనిస్తున్నారు: హరీశ్‌రావు



హైదరాబాద్: ధర్నాల పేరుతో రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అదానీ.. ప్రపంచం ముందు భారతదేశం పరువు తీశారని రేవంత్‌రెడ్డి అంటున్నారు.. అదానీతో చేతులు కలిపి సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీయలేదా.. అని విమర్శించారు.

"తెలంగాణలో వివిధ సంస్థల ఏర్పాటు కోసం అదానీతో సీఎం రేవంత్ రెడ్డి రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నారు. రూ.100 కోట్లు ఎలా వాపస్ ఇచ్చావో.. ఈ రూ.12,400 కోట్ల ఒప్పందాలు కూడా రద్దు చేసుకుని నిజాయతీ నిరూపించుకోవాలి. బయట కుస్తీ.. లోపల దోస్తీ అన్నట్టుంది రేవంత్‌రెడ్డి వ్యవహారం. రామన్నపేటలో డ్రైపోర్టుకు అనుమతిస్తే.. అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీకి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. దాదాపు 12 గ్రామాల ప్రజలు సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల కాలుష్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం పోలీసులను పెట్టి ఆందోళనకారులను అణచివేస్తున్నారు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, అదానీ సంబంధాలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని భారాస డిమాండ్ చేస్తోంది" అని హరీశ్‌రావు అన్నారు.

# అదానీ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

భారాస.. ప్రజల వైపా? అదానీ-ప్రధాని వైపా?

అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి భాజపాకు భారాస లొంగిపోయింది. అందుకే అదానీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. భారాస.. ప్రజల వైపా? అదానీ-ప్రధాని వైపా? అనేది తేల్చి చెప్పాలి. మోదీ-కేసీఆర్ వేర్వేరు కాదు.. ఇద్దరూ నాణేనికి బొమ్మాబొరుసు. భారాసకు చిత్తశుద్ధి ఉంటే అదానీ అవినీతిపై జేపీసీకి డిమాండ్ చేయాలి. ఆ పార్టీ కోరితే శాసనసభలో చర్చకు అనుమతిస్తాం. అదానీ అవినీతిపై జేపీసీ కోసం సభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దాం. ప్రధాని అండగా నిలబడినా.. ప్రజాకోర్టులో అదానీని శిక్షించే వరకు పోరాడుతాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# 'మూసీ'పై అబద్ధాలు ఎందుకు.. ఎవరి లాభం కోసం?: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు. "మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయటపెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. భారాస అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ.14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు" అని కవిత అన్నారు.

# బంగాళాఖాతంలోకి 'ధరణి' పోర్టల్

మొదటి పేజీ తరువాయి

"ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం"అని పొంగులేటి తెలిపారు.

# కూల్చివేతలపై కీలక ప్రకటన.. హైడ్రా విధివిధానాలు వివరించిన రంగనాథ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. "అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జులై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే హైడ్రా కూల్చదు. ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే అవి అక్రమ కట్టడాలే అవుతాయి. అనుమతులు రద్దైనా నిర్మాణాలు జరుగుతుంటే అక్రమ కట్టడాలుగానే పరిగణిస్తాం.

పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోంది.

లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోంది. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది" అని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

# ఫార్ములా-ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టండి: సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ



హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంపై ఈ శాసనసభ సమావేశాల్లోనే చర్చ పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి లేఖ రాశారు. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు, అవినీతి జరగలేదని.. శాసనసభలో సవివర చర్చ జరిగితే నిజాలేమిటో నిగ్గుతేలుతాయని పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో కొన్ని నెలలుగా గత భారాస ప్రభుత్వం మీద, ముఖ్యంగా తనపై ప్రభుత్వం అనేక నిరాధార అరోపణలు చేస్తోందని కేటీఆర్ ఆక్షేపించారు.

మంత్రివర్గ సమావేశంలోనూ గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్లు వార్తా కథనాలు వచ్చాయని, కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు రకరకాల లీకులు ఇస్తున్నారని పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య చర్చ కన్నా.. శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలన్న సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒప్పందం చేసుకుందని, 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకొందని కేటీఆర్ లేఖలో గుర్తు చేశారు. రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసిందని గుర్తు చేశారు. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగిందన్న అపోహలు సృష్టించే ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే రేసును కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారని ఆక్షేపించారు. ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం పూర్తి పారదర్శకంగా జరిగిందన్న ఆయన... రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని గతంలో వివరంగా చెప్పినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉందని, అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ పెట్టి అన్ని విషయాలు వివరంగా చెబుదామని అన్నారు. శాసనసభాపతిని కలిసిన భారాస ఎమ్మెల్యేలు ఫార్ములా-ఈ రేస్‌పై ఈ సమావేశాల్లో చర్చ జరగాలని కోరారు. ఈ మేరకు సభాపతికి వినతిపత్రం సమర్పించారు.

# ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటి పేజీ తరువాయి

"పదేళ్లలో భారాస చేయని అభివృద్ధి ఏడాదిలో చేయమంటే ఎలా..? ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. ఓవర్సీస్ ఉపకార వేతనాలను ఎక్కడ ఆపలేదు. భారాస సభ్యులు సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి" అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్ల భారాస హయాంలో ఆ పార్టీ నేతలు రూ. వేలకోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళితబంధు, ఈ-కార్ రేసుల్లో కమీషన్లు తీసుకున్నారన్నారు.


### భారాస సభ్యులపై స్పీకర్ ఆగ్రహం

అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామన్నారు. మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సీనియర్ సభ్యులు కొత్త సభ్యులకు నేర్పించేది ఇదేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అంబేడ్కర్‌ను సంపూర్ణంగా గౌరవిస్తోంది మేమే.. ప్రతిపక్షాల విమర్శలపై మోదీ కౌంటర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ప్రధాని మోదీ స్పందించారు. దిల్లీ: కేంద్ర హెూం మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేడ్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.


'కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేడ్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్ధాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేడ్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. గరిష్ఠ వాణిజ్య లోటు.. మోదీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు అంబేడ్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేడ్కర్ తన చివరి ఏడాదిలో గడిపిన దిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హెూంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారూటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు.రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేడ్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించారు. బుధవారం పార్లమెంటు ఆవరణలో అంబేడ్కర్ ఫొటో పట్టుకొని నిరసన తెలిపారు. ఆయన హెూంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.



# మెదక్ చర్చ్ శతాబ్ది ఉత్సవాలు


**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**






ఆంగ్లేయులు భారత దేశాన్ని పాలిస్తున్న కాలంలో మొదటి ప్రపంచయుద్ధ సమయంలో మెదక్ జిల్లాలో కరువు సంభవించింది. అప్పుడు క్రైస్తవ మిషనరీ, రెవెరెండ్ చార్లెస్ వాకర్ పోస్నెట్ "పనికి ఆహార పథకం" తో చర్చి నిర్మాణం తలపెట్టాడు.గ్రామస్తులు ఎవరైతే చర్చి నిర్మాణంలో పాల్గొన్నారో, వారికి ఆహారం మెతుకులు ఇవ్వబడ్డాయి.మెతుకులు అనగా అన్నం, అందుకే ఆ ప్రాంతానికి "మెదక్" అని పేరు వచ్చింది. అలా ఈ చర్చి నిర్మాణం, 1914 నుండి 1924 వరకు కొనసాగింది. ఇది ఆసియాలోనే అతి పెద్దది. ప్రపంచంలో, వాటికన్ చర్చి తరువాత, అతి పెద్దదైన ఈ చర్చి వాస్తుశిల్పి ఎడ్వర్డ్ హార్డింగ్. పూర్తిగా తెల్లరాయితో కట్టబడిన ఈ నిర్మాణం కోసం, ఆరు రంగుల మిశ్రమం కలిగిన చతురస్రపు పలకలను ఇంగ్లాండు నుండి, మేస్త్రీలను బొంబాయి నుండి తెప్పించారు. ఇంకా పాలరాతిని ఇటలీ నుండి తెప్పించారు. ఇప్పటికీ వారానికొకసారి, నేలను, అద్దాలను కిరోసిన్ కలిపిన కొబ్బరినూనెతో తుడుస్తారు. కిటికీ రంగుటద్దాలపై వ్రాయబడిన వాక్యాలు, ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషలలో కనిపిస్తాయి. మొదట వాక్యాలు హిందీలో లేవు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోదరి, విజయలక్ష్మి పండిట్ ఈ చర్చిని సందర్శించినప్పుడు, జాతీయభాష అయిన హిందీలో వ్రాయించింది.ఇది ఆసియాలో అతిపెద్ద డియోసెస్ మరియు వాటికన్ తర్వాత ప్రపంచంలో రెండవ అతిపెద్దది. తెలంగాణలోని మెదక్ పట్టణంలో ఉంది.మెదక్ కేథడ్రల్, చర్చ్ఆఫ్ సౌత్ ఇండియాకు మెదక్ లోని బిషప్ స్థానం. చర్చి కాంప్లెక్స్ 300 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న ఆర్కిటెక్చరల్ అద్భుతం.చర్చ్ నిర్మాణానికి నిజాం రాజు నుండి వెయ్యి ఎకరాలు కొనుగోలు చేసారు. అయితే చార్మినార్ కంటే 9 అడుగుల తక్కువ ఎత్తుతో నిర్మించాలని నిజాం షరతు విధించాడు.కేథడ్రల్ 100 అడుగుల (30 మీ) వెడల్పు మరియు 200 అడుగుల (61 మీ) పొడవు, 175 ఫీట్ల (53 మీ) ఎత్తు తో నిర్మించబడింది.మెదక్ చర్చ్ గోతిక్ రివైవల్ స్టైల్ కు అనుగుణంగా ఉంటుంది. మరియు 5,000 మందికి ఒకేసారి వసతి కల్పించగలిగిన ఈ చర్చ్ ఒక పర్యాటక స్థలంగా పేరు తెచ్చుకున్నది.మెదక్ కేథడ్రల్ యొక్క అతిపెద్ద ఆకర్షణ క్రీస్తు జీవితంలోని విభిన్న దృశ్యాలు.క్రీస్తు జీవిత విశేషాలను వర్ణించే దాని గాజు కిటికీలు, బలిపీఠం వెనుక అసెన్షన్, పశ్చిమ ట్రాన్సెప్ట్ నేటివిటీ మరియు తూర్పు ట్రాన్సెప్ట్ సిలువ వేయడం లాంటి హస్తకళా నైపుణ్యం ఈ చర్చ్ ప్రత్యేకత.మెదక్ చర్చ్ దేశవ్యాప్తంగా సంవత్సరానికి మూడు మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తుంది.1914 లో ప్రారంభమైన మెదక్ చర్చ్ నిర్మాణం 1924 లో ముగిసింది.25 డిసెంబర్ 1924 క్రిస్మస్ రోజు తొలి ప్రార్థనతో ప్రారంభమైన మెదక్ చర్చ్ కు 2024 డిసెంబర్ 25 తేదీకి వంద సంవత్సరాలు.మెదక్ చర్చ్ వంద సంవత్సరాల శతాబ్ది వేడుకలు జరుపుకోబోతున్న సందర్భంలో మెదక్ డయాసిస్ ఇన్చార్జి బిషప్ రైట్ రెవరెండ్ డా. ప్రొఫెసర్ రూబెన్ మార్క్ క్రిస్మస్ శుభాకాంక్షలు అందించారు.




# ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి



**కరుణాకర్ దినపత్రిక/ హుజురాబాద్:ప్రతినిధి: డిసెంబర్ 18,**

హుజురాబాద్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కు నివేదిక ఇచ్చినఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఇమ్మడి దయాకర్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ పై బుధవారం రోజు ఏకసభ్య కమిషన్ చైర్మన్ మాజీ జడ్జి షామీమ్ అక్తర్ కి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని నివేదిక ఇవ్వడం జరిగింది .అనంతరం ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఇమ్మడి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో 59 షెడ్యూల్ కులాలను వారి వారి సంఖ్యను బట్టి రిజర్వేషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పుని ఇవ్వడం జరిగింది .కానీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్థికంగా రాజకీయంగా ఉద్యోగ పరంగా అభివృద్ధి చెందిన కులాలను షెడ్యూల్ కులం నుండి తొలగించాలని రాజ్యాంగంలో స్పష్టంగా రాశారు. ఎస్సీ వర్గీకరణ అమలుకై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి షమీమ్ అక్తర్ కి ఒక నివేదిక సమర్పించడం జరిగింది.ఎస్సీ కులంలో 59 కులాలకు సంబంధించిన ప్రతి చిన్న కులానికి న్యాయం జరగాలని ఎవరి వాట వారికి దక్కాలని అందుకే ఏబిసిడి వర్గీకరణ జరగాలని ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గా కోరడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎంఐఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రత్నం,మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్ సారయ్య ,సీనియర్ దళిత నాయకులు మొలుగూరి కొమరయ్య, ద్రవిడ మహాసభ కన్వీనర్ రామ్ రాజేశ్వర్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి రాజయ్య, రొంటల కుమారస్వామి,శనిగరం భాస్కర్,ఇమ్మడి కిరణ్,పాల్గొన్నారు

# అభిప్రాయ సేకరణలో పాల్గొన్న మండల దళిత నాయకులు....

**కరుణాకర్ శంకరపట్నం డిసెంబర్ 18**

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన అభిప్రాయ సేకరణ భాగంగా బుధవారం కరీంనగర్ పట్టణంలో తెలంగాణ షెడ్యూల్ కులాల విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విచారణ అభిప్రాయ సేకరణ కు శంకరపట్నం మండలం నుండి దళిత సంఘాల నాయకులు హాజరైనట్లు కాచాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ దళిత సంఘ నాయకులు కొండ్ర రాజయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు దేశంలో,రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టేందుకు ఆయా రాష్ట్రాల్లో వర్గీకరణ అభిప్రాయ సేకరణ జరుగుతుందని అందులో భాగంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ షెడ్యూల్ కులాల కమిషన్ నిర్వహించిన అభిప్రాయ సేకరణ హాజరై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు రాజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కల్వల మాజీ సర్పంచ్ దాసారపు భద్రయ్య, బొజ్జ రవి, క్యా దాసి భాస్కర్, కన కం శంకర్, తదితరులు పాల్గొన్నారు

# చలికాలం సందర్భంగా పేదలకు చద్దర్ల పంపిణీ

**కరుణాకర్ ప్రతినిధి వేములవాడ డిసెంబర్ 18.**

చలికాలం కావడంతో చలి తీవ్రత వల్ల యాచకులు పేదలు ఇబ్బంది పడుతుండడంతో ట్రస్ట్ సభ్యులు గుప్తదాత అందించిన సహకారంతో 50 రగ్గులు కొనుగోలు చేసి పేదలకు, యాచకులకు బుధవారం రోజున రాత్రి వేళల్లో జమ్మికుంట వాస్తవ్యులు పంతటి రవీందర్ చేతుల మీదుగా పేదలకు చద్దర్ల పంపిణీ చేయడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు.

# లయోలా విద్యార్థుల గ్రామ పర్యటన

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**




గ్రామీణ వ్యవసాయ స్థితిగతుల అధ్యయనంలో భాగంగా వోల్డ్ అల్వాల్ సికింద్రాబాద్ లయోలా అకాడమి డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు సూర్యాపేట జిల్లా చివ్వంల గ్రామం మరియు మండల కేంద్రంలో పర్యటించారు.గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావె) లో భాగంగా లయోలా అకాడమీ సికింద్రాబాద్ కి చెందిన బి యస్సి వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా అధ్యయనం చేసినట్లు కె.వి.కె- గడ్డిపల్లి ప్రోగ్రామ్ అసిస్టెంట్ మరియు రావె ఇంచార్జ్ దొంగరి నరేష్ తెలిపారు. చివ్వెంల నందు నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు గ్రామ పటం ద్వారా గ్రామం నందు గల మౌలిక సదుపాయాలు, వసతులు, సాగు భూమి విస్తీర్ణం, నీటిపారుదల, నేల రకాలు మరియు వ్యవసాయము నందు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకొని, సదస్సులో వివరించడం జరిగింది.గ్రామంలో పండించే పంటల గురించి వివరిస్తూ, రైతులు ఎక్కువగా వరి పంటనే పండిస్తున్నారని, ఒకే పంట పండించడం వలన చీడపీడలు కూడా ఎక్కువ అవుతున్నాయని రైతులకు తెలియజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న దొంగరి నరేష్, కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్నటువంటి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారి యాజమాన్యం పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరులు ,ఏఇఓ ప్రియాంక, పాఠశాల యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు యాన రమేష్ ,లక్ష్మి, సంగమిత్ర, రైతులు సోలమన్, స్టాలిన్, ఇట్టిమల్ల భిక్షం, ఆనంద్ రావు, విద్యార్థులు నీరటి స్టెఫీ, మండల సాయి అనుష, బుగ్గ ప్రవళిక, లింగంపల్లి శివాని పాల్గొన్నారు. గ్రామీణ వ్యవసాయ విశ్లేషణ పటం ద్వారా అవగాహనా కలిపిస్తున్న వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు మరియు కె.వి.కె శాస్త్రవేత్త మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్యం ను ఈ చిత్రంలో గమనించవచ్చు.

# "స్థానిక" ఎన్నికల్లో యువతకు అవకాశం ఇవ్వాలి...

**- కాంగ్రెస్ యువ నాయకుడు మద్దుల ప్రశాంత్**

**కరుణాకర్ ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 18.**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేయాలని, పోటీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ కోరారు. బుధవారం ఆయన వీణవంక మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పదికాలాలపాటు ప్రజా శ్రేయస్సుకు పనిచేయాలంటే గ్రామాల్లో యువతకు చాన్స్ ఇవ్వాలని కోరారు. యువ రక్తం హస్తం పార్టీలో ఉన్నంతగా మరే పార్టీలో లేదని చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలో యువతీ యువకులకు లోకల్ బాడీ ఎలక్షన్స్ లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పోటీకి అవకాశం కల్పించాలని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో స్థానికంగా బలం కలిగిన కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వీణవంక మండల పరిధిలో కొమ్మిడి రాకేష్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు బలంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర స్థాయిలో ఏఐసీసీ అగ్రనేత లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గదర్శనంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ఫుల్ ప్రయారిటీ ఇవ్వాలని అభ్యర్థించారు. గత పాలకుల మాదిరిగా పాతవారికే మళ్లీ ప్రయారిటీ ఇస్తే గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయాలన్నిటిని నిశితంగా గమనించి యువతకు లోకల్ బాడీ ఎలక్షన్స్ లో హైయెస్ట్ ప్రయారిటీ ఇచ్చి.. పోటీకి పెద్దపీట వేయాలని కోరారు. పార్టీ పెద్దల మార్గదర్శనంలో యువత చక్కగా పనిచేసే అవకాశాన్ని నాయకత్వం పరిశీలించాలని అభ్యర్థించారు.



# ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్య... పౌష్టికాహారం..

**- టీపిసిసి సభ్యులు మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్..**

**కరుణాకర్ శంకర పట్నం డిసెంబర్ 18**



రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్యను రాష్ట్ర ప్రభుత్వము కల్పిస్తుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాలని ,శంకరపట్నం మాజీ జడ్పిటిసి సభ్యులు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్అన్నారు . బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని మెట్ పల్లి గ్రామపంచాయతీ వెంకటేశ్వర పల్లెలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కు ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము ఎమ్మెల్యేలు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ వసతులను కల్పిస్తూ, పౌష్టికాహారం త పాటు అన్ని సకల సదుపాయాలను అందజేస్తున్నారని, ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన, 12 లక్షల 60 వేల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణం చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి రజక, మాజీ ఎంపీటీసీ అంతడుపుల సంపత్, మెట్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టే మధు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడెపు అజయ్, యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు మొహమ్మద్ షారుక్, కేశవపట్నం గ్రామ శాఖ అధ్యక్షులు మొలంగూరి సదానందం, నాయకులు బహుమతి హిసామో ద్దిన్, గట్టయ్య, రాజయ్య, ప్రవీణ్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్లపల్లి నాగరాజును అభినందించిన కవ్వంపల్లి

**– యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పర్లపల్లి నాగరాజుకు శాలువాతో సత్కారం**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 18**



ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పర్లపల్లి నాగరాజు ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యువకుల సమస్యలు తెలుసుకొని పరిష్కారం దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే నాగరాజు కు సూచించారు ఈ సందర్భంగా పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన తర్వాత మొట్ట మొదటిసారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ని కలిసి ఆశీస్సులు తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు కచ్చితంగా యువకుల సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవ్వడం మరింత బాధ్యతను పెంచిందని అన్నారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు టేకుల శ్రావణ్,చెంచల మణిదీప్, ఆకునూరి అజిత్,అన్వేష్ తదితరులు పాల్గొన్నారు

## చలో రాజ్ భవన్ ప్రదర్శనలో పాల్గొన్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి. డిసెంబర్ 18**






నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల భారీ జన సమీకరణ తో రాజ్ భవన్ వరకు ప్రదర్శన కార్యక్రమం.. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ శ్రీమతి దీపా దాస్ మున్షి మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, అలాగే మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్ని నియోజక వర్గ ఇంఛార్జులు, ఈ యొక్క ప్రదర్శనలో పాల్గొనడం జరిగింది, ఇందులో భాగంగా గువ్వ రవి ముదిరాజ్ మాట్లాడుతూ..! అమెరికా లో గౌతమ్ ఆధాని పై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయి. ఆధాని పై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయి. అలాగే మణిపూర్ లో వరసగా జరిగిన అల్లర్లు, విద్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెల్లకపోవడంలాంటి అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నాడు చలో రాజ్ భవన్ కార్యక్రమం ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో చెప్పాడం జరిగింది. ఈ ప్రదర్శనకు బి బ్లాక్ మహేష్ కుమార్ గౌడ్ గౌడవల్లి మాజీ సర్పంచ్ సురేందర్ తుంకుంట మున్సిపల్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కన్వీనర్ మునిగొండ శేఖర్ మేడ్చల్ మండల ఓబీసీ అధ్యక్షులు బ్రమణపల్లి శ్రీనివాస్ గౌడ్ తుంకుంటా మున్సిపాలిటీ ఓబీసీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ పోచారం మున్సిపాలిటీ ఓబీసీ అధ్యక్షులులక్ష్మీనారాయణ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో బారీగా తరలి రావడం జరిగింది, అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓ బి సి అధ్యక్షులు జి రవి ముదిరాజ్ అన్నారు

## శ్రీ సరస్వతి శిశు మందిర్ లో పై అంతస్తు నిర్మాణానికి పూజ కార్యక్రమం.......

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 18...**





కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం జమ్మికుంట పాఠశాలలో స్వర్ణజయంతి భవనం పైన అంతస్తుకై వేద పండితులైన ఎలబాక వర ప్రసాద్ ఆచరివచనంతో 1985-1986 విద్యార్థుల సహకారంతో జమ్మికుంట పట్టణ ప్రముఖులు పూర విద్యార్థులు అనేకమంది దాతలతో అభయం తో నిర్మాణానికి ఈరోజు పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో డాక్టర్ ముక్క రాజేశ్వరయ్య 100 బస్తాల సిమెంటు మరియు శీల జయప్రకాష్ కరెంటు సామాగ్రి అందిస్తామని వాగ్దానం చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో విద్యాపీఠం జిల్లా కార్యదర్శి తేల రాజమౌళి , డాక్టర్ చిట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి , పూర్వ విద్యార్థులు పుల్లూరి శ్రీనివాస్, బొల్లం మనోహర్, పాఠశాల సమితి అధ్యక్ష కార్యదర్శులు ఆవాల రాజారెడ్డి, ఆకుల రాజేందర్, ప్రబంధకారిణి కార్యదర్శి దాసరి రవీందర్ మరియు కమిటీ సభ్యులు బుర్ర శివయ్య, కేతుపల్లి మాధవరెడ్డి, బాదం రమేష్, బచ్చు శివకుమార్, ముక్క జితేందర్ గుప్తా, చిదురాల భాస్కర్, చందా శివకుమార్, ఎక్కడి రగోతంరెడ్డి ప్రధాన చారులు గుడికందుల సుదర్శన్ , పొలసాని సుధాకర్ రావు ఆచార్యుల బృందం పాల్గొన్నారు.

## దైవ క్షేత్రాల సందర్శన మానసిక ప్రశాంతత..

**– ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు....**
**– ఎమ్మెల్యే సత్యనారాయణ...**

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 18**



దైవ క్షేత్రాల, దైవ దర్శనం, ఆధ్యాత్మికత మానవులకు ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణం, భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ. తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గము, ఎమ్మెల్యేలు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిధులు విడుదల చేస్తున్నారని, అందులో భాగంగా ఆధ్యాత్మికత దైవ క్షేత్రాల అభివృద్ధి, చేయడం జరుగుతుందని, కేశవపట్నం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి 50 లక్షల రూపాయల నిధులను దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి విడుదల చేసినట్లు వెల్లడించారు. ఆధ్యాత్మికను దైవ క్షేత్రాలను సందర్శిస్తే మనసు ఉల్లాసంగా ఉంటుందని, దైవ దర్శనం ఎంతో శ్రేష్టం అన్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని వినియోగించుకోవాలని సూచించారు.మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్ అసహనం...శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునర్ నిర్మాణం కార్యక్రమంలో చట్టసభలకు ప్రాతినిధ్య వహించే శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టకముందే, ఎమ్మెల్యే కంటే ముందుగా గత ప్రభుత్వములోని ఆ ప్రభుత్వ పుత్రిక, పత్రిక విలేకరి అయిన పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కావడంతో కొబ్బరికాయలు కొట్టడంతో శంకరపట్నం మాజీ జెడ్పిటిసి తిపిసి సభ్యులు బత్తిని శ్రీనివాసగౌడ్ అసహనం వ్యక్తం చేసి నిబంధనలు పాటించాల్సిన విలేకరి వృత్తిలో ఉండి కూడా నిరంకుశంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ ఆ విలేఖరి తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసి మరోసారి ఇలా చేయవద్దని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి కృషిచేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు శాసనసభ్యులకు, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ కు గ్రామస్తులు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బసవయ్య గౌడ్, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి రజక, పాలకవర్గ సభ్యులు, శంకరపట్నం మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తణుకు ప్రభాకర్, మానకొండూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు గాజుల వెంకటేశ్వర్లు, ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ గాజుల శ్రీనివాస్, మాజీ సర్పంచులు మోత్కూరి సమ్మయ్య, గొడిశాల రాజ కొమురయ్య, నిర్మాణ కమిటీ సభ్యులు తణుకు సత్యనారాయణ, బొజ్జ చంద్రమౌళి, జున్నాల రాయమల్లు, తణుకు ఓంకారం, గుర్రం రామస్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలంగూరి సదానందం, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి గండికోట రవి, తిరుపతి గౌడ్ పార్థసారథి, శ్రీనివాస్ ,గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలల బస్సులు ఎలాంటి పర్మిషన్ లేకుండా యాదగిరి శేఖర్ రావు ప్రచారానికి వాడటం సిగ్గు చేటు

**– యాదగిరి శేఖర్ రావుకు కొమ్ము కాస్తున్న పాఠశాలల యాజమాన్యాలు...**
**– సామాజిక కార్యకర్త – గట్టు సాయిరాం**
**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 18....**






జమ్మికుంట పట్టణంలో పలు పాఠశాలల బస్సులు యాదగిరి శేఖర్ రావు ప్రచారానికి వాడుతున్నారని సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం అన్నారు ఏమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించక ముందే యాదగిరి శేఖర్ రావు ఎలాంటి పర్మిషన్ లేకుండా ప్రచారం బడి బస్సులతో మొదలు పెట్టారు అంతగా ప్రచారం చేసుకోవాలంటే ఏ ఆటోలకో మైకులు పెట్టో స్టిక్కెర్లు వేసి చేసుకోవాలి కానీ ఇలా విద్యార్థులు పోయే బస్సులకు స్టిక్కెర్లు వేసి ప్రచారం చెయ్యడాం సిగ్గు చేటు అన్నారు ఈ విషయం లో యాదగిరి శేఖర్ రావును పట్ట భద్రుల అభ్యర్థిగా అర్హత లేదు అని తెలియజేసారు అస్సలు ఈ విషయాన్ని చూసి చూడనట్లు గా వ్యహరిస్తున్న విద్యాధికారులు వేకిల్ ఇన్స్పెక్టర్ ఈ విషయం పై తక్షణేమే జిల్లా కలెక్టర్ స్పందించి ఆ పాఠశాలల యొక్క బస్సులను సీజ్ చేసి ఆ పాఠశాలల యొక్క గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము లేని యెడల ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాము...

## చలో రాజ్ భవన్ ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు థామస్ ఏసు పాదం

**కరపత్రం దినపత్రిక/ హుజురాబాద్ :ప్రతినిధి డిసెంబర్:18**



హుజురాబాద్ నెక్లెస్ రోడ్లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుండి కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్ మున్షి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలుచలో రాజ్ భవన్ ప్రదర్శనలో పాల్గొని భారీ జన సమీకరణ తో రాజ్ భవన్ వరకు ముఖ్యమంత్రి సలహాదారుడు మాజీ మంత్రి వేం నరేందర్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గం ప్రాంతానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు థామస్ యేసు పాదం ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ లీడర్లు విద్యార్థి సంఘ నాయకులు తదితర కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొని నెక్లెస్ రోడ్డు రాజ్ భవన్ ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ ప్రదర్శన సందర్భంగా
థామస్ యేసు పాదం మాట్లాడుతూ..! అమెరికా లో గౌతమ్ ఆధాని పై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయి. ఆధాని పై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయి. అలాగే మణిపూర్ లో వరసగా జరిగిన అల్లర్లు, విద్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెల్లకపోవడం హాస్యాస్పదమని అన్నారు

## ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలి

**ములుగురి సదయ్య వకీల్... కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 18**

ఏబిసిడి వర్గీకరణ కోసం ప్రత్యేక పర్యటన చేస్తూన్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమిమ్ అక్తర్, రిటైర్డ్ జస్టిస్ ని కలిసి ఏబిసిడి వర్గీకరణ చేయాలని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొలుగూరి సదయ్య వకీల్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర వ్యాప్తంగా అంటే రాష్ట్రము యూనిట్ గా వెంటనే అమలు చేయాలి అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో 59 కులాలు ఉండగా జనాభా ప్రకారం రిజర్వేషన్లలో ఎవరి వాటా వారికి చెందే విధంగా వెంటనే ఏబిసిడి వర్గీకరణ చేసి అట్టి కులాలకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మట్టిల తిరుపతి, మారేపల్లి ప్రభాకర్, మోరే కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

